క్లుప్తంగా

పంటల నమోదు తప్పనిసరి

మొయినాబాద్‌రూరల్‌: గ్రామాల్లో రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఓ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ.. పంటల సాగు వివరాలను ఆన్‌లైన్‌ నమోదు చేసినట్లయితే పంటలు విక్రయించే సమయంలో సులభతరం అవుతుందన్నారు. పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు వీలుంటుందని తెలిపారు. ఆయా గ్రామాల అధికారుల వద్ద పంటల నమోదు చేయించుకోవాలని సూచించారు.

సన్మానం



వెంకటేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌: ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామానికి చెందిన దొడల వెంకటేశ్‌ యాదవ్‌ ప్రభుత్వ పాలన శాస్త్రం పంచాయతీ రాజ్‌ వ్యవస్థపై పరిశోధన చేశాడు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయన డాక్టరేట్‌ పట్టా పొందాడు. ఈ మేరకు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి వెంకటేశ్‌యాదవ్‌ స్వగృహానికి వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌అప్ప, అనిల్‌కుమార్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



రాచన్నను పరామర్శిస్తున్న స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌

శంకర్‌పల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వికారాబాద్‌ జిల్లా మర్పల్లి మండలం కల్కోడా గ్రామ మాజీ సర్పంచ్‌ రాచన్నను బుధవారం అసెంబ్లీ స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌ పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవలను గూర్చి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం కల్పించారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

మంచాల: రంగాపూర్‌ వయా దాద్‌పల్లి మీదుగా మాల్‌ వరకు రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్‌ బైరిక రమాకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. రంగాపూర్‌ మార్గం సింగిల్‌ కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు విస్తరణ చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు రవాణా అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. 12 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ నాయకులు కోటి నాయక్‌, మాధవ రెడ్డి, బాల్‌రెడ్డి, తిరుమలేష్‌, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డి మృతి తీరని లోటు

కడ్తాల్‌: సింగిల్‌విండో డైరెక్టర్‌ శ్రీపాతి వెంకట్‌రెడ్డి మృతి.. ప్రాంత రైతాంగానికి తీరని లోటని డీసీసీబీ డైరెక్టర్‌, సింగిల్‌విండో చైర్మన్‌ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధి ముద్విన్‌ గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం సింగిల్‌విండో చైర్మన్‌, పాలకమండలి సభ్యులతో కలిసి స్వగ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక సింగిల్‌ విండో కార్యాలయం వద్ద వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన రైతాంగానికి చేసిన సేవలను కొనియాడారు. సింగిల్‌విండో వైస్‌ చైర్మన్‌ సత్యం, డైరెక్టర్లు వెంకటయ్య, సేవ్యానాయక్‌, వెంకటేశ్‌, అంతిరెడ్డి వినోద్‌ పాల్గొన్నారు.

అభ్యంతరాలు స్వీకరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్‌ ముంతాజ్‌

కడ్తాల్‌: ఓటరు జాబితాల్లో గుర్తించిన డబుల్‌ ఓట్లు, మృతి చెందిన వారి వివరాలను.. మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి సేకరించాలని, విచారణ చేసి, అభ్యంతరాలను స్వీకరించాలని తహసీల్దార్‌ ముంతాజ్‌ బీఎల్‌ఓలకు సూచించారు. అనంతరం నివేదికలు పొందుపరచాలని ఆదేశించారు. బుధవారం తహసీల్‌ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్‌ జాబితా గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ ఆదిత్య, ఆర్‌ఐలు రాజిరెడ్డి, వహీద్‌ పాల్గొన్నారు.

కొత్త రేషన్‌.. సన్నబియ్యం



కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్‌ నహిబ్‌ (ఫైల్‌)

హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బడంగ్‌పేట్‌: పుష్కరకాలం రేషన్‌కార్డుకోసం ఎదురు చూసిన అర్హులకు ఎట్టకేలకు ప్రభుత్వం నూతనంగా ఆహార భద్రత కార్డులను అందజేసింది. దీంతో కొత్తగా రేషన్‌ కార్డు పొందిన అబ్ధిదారులు.. హర్షంవ్యక్తం చేస్తూ సన్నబియ్యం తీసుకునేందుకు నిత్యవసరాల దుకాణాలకు బారులు తీరుతున్నారు.

మొత్తం కార్డులు 26,741

బాలాపూర్‌ మండలంలో మీర్‌పేట్‌, బడంగ్‌పేట్‌ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీలు బాలాపూర్‌ మండలం కిందకు వస్తాయి. ఇటీవల ప్రభుత్వం కొత్తగా 7,651 కార్డులు మంజూరు చేసింది. ఇంతకు ముందు అంత్యోదయ, ఆహారభద్రత కార్డులు, కొత్తగా వచ్చిన కార్డులతో కలిపి మొత్తం 26,741 కార్డులు ఉన్నాయి. అదనంగా 93,908 యూనిట్లు పెరిగాయి. మరి కొన్ని పెండింగ్‌లో, ఇంకొన్ని పలు కారణాల వలన నిలిచిపోయాయి. ఆయా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, దశల వారీగా అర్హులందరికీ అందజేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

అర్హులందరికీ..



కొత్తగా రేషన్‌ కార్డులు పొందిన వారికి ఈ నెల నుంచి రేషన్‌ను పంపిణీ చేస్తున్నాం. ఇప్పటికే అన్ని రేషన్‌ దుకాణాలకు సన్న బియ్యం పంపించాము. నేడో రేపో సరఫరా చేస్తాం. పెండింగ్‌ దరఖాస్తులను పరిశీలన చేసి, అందరికీ ఇస్తాం.

– ఇందిరాదేవి, తహసీల్దార్‌

డ్రైనేజీ ఔట్‌లెట్‌ ఏర్పాటు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీవాసులు, స్థానిక బీజేపీ నాయకులు

మీర్‌పేట: డ్రైనేజీ ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేస్తూ కాలనీవాసులు, స్థానిక నాయకులు బుధవారం జలమండలి జీఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్పొరేషన్‌ పరిధిలోని విజ్ఞానపురి కాలనీ, టీచర్స్‌కాలనీ, అల్మాస్‌గూడ పరిధిలోని కాలనీలకు సంబంధించిన డ్రైనేజీ వెళ్లే నాలాలో బుధవారం అటవీశాఖ, జలమండలి అధికారులు మట్టివేసి అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు స్థానిక నాయకులతో కలిసి జలమండలి జీఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రైనేజీ నీరంతా అటవీ శాఖ పరిధిలోకి వస్తోందని, ప్రత్యేకంగా ఔట్‌లెట్‌ను నిర్మించుకోవాలని నెలరోజుల క్రితమే అటవీశాఖ వారు నోటీసు ఇచ్చినప్పటికీ జలమండలి అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం డ్రైనేజీని అడ్డుకోవడంతో దాదాపు వెయ్యి ఇళ్లకు సమస్యగా మారుతోందని, గణేశ్‌ నవరాత్రుల వేళ కాలనీలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడతామని, సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. స్పందించిన జలమండలి జీఎం రూ.17 లక్షల వ్యయంతో త్వరలోనే ఔట్‌లెట్‌ నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ధర్నాను విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్‌ పెండ్యాల నర్సింహ, బీజేపీ జిల్లా రూరల్‌ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ విక్కీసాగర్‌, విజ్ఞానపురి కాలనీ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పాలనపై ప్రజలకు విసుగు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సబితారెడ్డి

- భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌ పార్టీదే
- ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టి ఘర్షణలు జరిగే విధంగా కుట్రలు చేస్తోందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ఆ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందగా బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరుతున్నారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీలకు తగిన బుద్ధి చెప్పి బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడతారన్నారు. భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ మంచె పాండుయాదవ్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు బండారి లింగంముదిరాజ్‌, మాజీ ఉపసర్పంచ్‌ లతీఫ్‌ఖాన్‌, బీఆర్‌ఎస్‌ గ్రామ శాఖ అధ్యక్షుడు అయిల్ల శివగౌడ్‌, మాజీ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ కర్రె రాజు, బీఆర్‌ఎస్‌ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు మంచె పవన్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అలైన్‌మెంట్‌ మార్చాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం తహసీల్దార్‌ అజాంఅలీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రీజినల్‌ రింగ్‌ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్‌) గ్రామంలోని పలు సర్వే నంబర్ల నుంచి వెళ్తున్నట్టు తెలిసిందన్నారు. ఈ సర్వే నంబర్లలో గ్రామానికి చెందిన నిరుపేద రైతు కుటుంబాలు ఉన్నాయన్నారు. తాము పాడిపరిశ్రమ, వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నామన్నారు. అధికారులు స్పందించి రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలన్నారు. లేకుంటే ఆర్‌ఆర్‌ఆర్‌కు ఎట్టి పరిస్థితుల్లో వ్యవసాయ భూములను అప్పగించమన్నారు. ప్రాణాలనైనా వదులుకుంటామని, భూములను మాత్రం వదులుకోలేమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆకుకూరలు కోసే రోబోటిక్‌ యంత్రం ఆవిష్కరణ



రోబోటిక్‌ యంత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్‌ జానయ్య

మొయినాబాద్‌: సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. వ్యవసాయ పనుల్లోకి ఇప్పటికే అనేక యంత్రాలు వచ్చాయి. వాటికి తోడు ఇప్పుడు ఆకుకూరలు కోసి, కట్టలు కట్టే రోబోటిక్‌ యంత్రం(హార్వెస్టర్‌) రాబోతోంది. మున్సిపల్‌ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాల విద్యార్థులు ఈ యంత్రాన్ని రూపొందించారు. ఇటీవల రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అగ్రిహబ్‌లో ఆకుకూరలు కోసి, కట్టలు కట్టే రోబోటిక్‌ యంత్రాన్ని ప్రదర్శించారు. దీనికి యూనివర్సిటీ ఇంక్యుబేటర్‌లో చోటు కల్పించి ఆధునీకరించి అంకురాల గ్రాడ్యుయేషన్‌ డే కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్‌ జానయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. యంత్రాన్ని తయారు చేసిన విద్యార్థులను, ప్రోత్సాహం అందించిన కేజీరెడ్డి కళాశాల డైరెక్టర్‌ రోహిత్‌ కందకట్లను ఆయన అభినందించారు. ఈ యంత్రాన్ని మార్కెట్‌లోకి విడుదల చేయడానికి రూ.40 లక్షల పెట్టుబడి నిధిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీరెడ్డి కళాశాల విద్యార్థులు ఆకుకూరల కోత కోసం తయారు చేసిన ఆటోమేటిక్‌ రోబోటిక్‌ యంత్రం కేవలం సాంకేతిక విజయం మాత్రమే కాదని.. వ్యవసాయ సాంకేతికతలో ముందడుగుకు నిదర్శనమన్నారు. యువ ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తే.. వారు రేపటి వ్యవసాయ భవిష్యత్‌ను నిర్మిస్తారన్నారు.

ఆశవర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబు

కొత్తూరు: ఆశవర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం.. వారికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబు ఆరోపించారు. బుధవారం కొత్తూరులో ఆశవర్కర్లతో మండల మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. అనంతరం ఆశవర్కర్ల మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాజేశ్వరీ, ప్రధాన కార్యదర్శిగా బుజ్జి, కోశాధికారిగా నవనీత, సహాయ కార్యదర్శురాలిగా అనిత, ఉపాధ్యక్షులుగా ఇందిరా, వసంత, సభ్యులుగా లక్ష్మీ, కవిత, మహేశ్వరీ, లక్ష్మీ, శ్రీవాణి, కమల, అనిత తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆశలు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: పట్టణంలోని క్రిస్టియన్‌ కాలనీ, భాగ్యనగర్‌ కాలనీల్లో యూటీఎఫ్‌డీసీ నిధుల నుంచి రూ.2.16కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్‌, తిరుపతిరెడ్డి, బస్వం, కృష్ణారెడ్డి, వన్నాడ ప్రకాశ్‌గౌడ్‌, ఖదీర్‌, నరేశ్‌, రాజు, సూర్యప్రకాశ్‌, ముబారక్‌, మసూద్‌ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: దాసర్లపల్లిలో.. వినాయకుడి నిమజ్జనం

ఘనంగా గణనాథుడికి పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు మహేశ్వరం నియోజకవర్గంలో ఘనంగా కొనసాగుతున్నాయి. 8వ రోజు బుధవారం గణపతికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి జయములివ్వు గణేశా అంటూ వేడుకున్నారు. మండపాల వద్ద అన్నదానం చేశారు. పలు గ్రామాల్లో వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు.



తుక్కుగూడ: రావిర్యాలలో.. డీజీపీ సునితారెడ్డి, కమిటీ సభ్యులు

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయండి

ఎమ్మెల్యే సబితారెడ్డి



సిర్లాహిల్స్‌ శ్మశానవాటికను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: శ్మశానవాటికలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మున్సిపల్‌ అధికారులను ఆదేశించారు. బుధవారం మీర్‌పేట సిర్లాహిల్స్‌లోని శ్మశాన వాటికను అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. శ్మశానవాటికలో దహన సంస్కారం నిమిత్తం అదనంగా స్లాబ్‌షెడ్‌, విశ్రాంతి గది, సీసీరోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయని, వెంటనే ఇట్టి పనులను ప్రారంభించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. దీంతో పాటు టాయిలెట్స్‌కు మరమ్మతులు, గ్రీనరీ పనులను పూర్తి చేయాలన్నారు. శ్మశానవాటికకు ఆనుకొని చెరువు వాకింగ్‌ ట్రాక్‌ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కావున అది కనపడకుండా ఇనుప కంచెను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట డీఈ వేణుగోపాల్‌, ఏఎంసీ నాగేందర్‌రెడ్డి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ భాస్కర్‌, మాజీ ఫ్లోర్‌ లీడర్‌ అర్కల భూపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్‌ తదితరులు ఉన్నారు.



మృతుడు చైతన్యయాదవ్‌ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

పరామర్శ

బడంగ్‌పేట్‌: లండన్‌ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తర్రె చైతన్యయాదవ్‌ (అభి) కుటుంబాన్ని నాదర్‌గుల్‌లో బుధవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. తల్లితండ్రులు ఐలయ్య, మంగమ్మ దంపతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చైతన్య మృతదేహాన్ని స్వగ్రానికి రప్పించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తోందని.. ఆ దిశగా లండన్‌ ఎంబసీ, సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. అంతవరకు గుండె నిబ్బరం చేసుకోవాలని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఉన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

స్థానిక సంస్థల మండల కన్వీనర్‌ మహేశ్‌



కేంద్ర పథకాల కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కేశంపేట: ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో ఇంటింటికీ తీసుకెళ్లాలని బీజేపీ స్థానిక సంస్థల మండల కన్వీనర్‌ కంచుకోట మహేశ్‌ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ ఎంపీపీ నర్సింహయాదవ్‌తో పాటు మహేశ్‌ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాన్ని నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో కేంద్ర ప్రభుత్వం వాటా ఉన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమ పథకాలను అమలులో కాంగ్రెస్‌ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పదేళ్లు పాలించి అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్‌ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, తట్టిపల్లి నర్సింహ, కోశాధికారి పాలాది శ్రీనివాస్‌, సీనియర్‌ నాయకులు కుమారస్వామి, యాదగిరిగౌడ్‌, పాండు, పవన్‌కుమార్‌రెడ్డి, జగన్‌, శివ, రాఘవేందర్‌, శ్రీనివాస్‌గౌడ్‌, గణేశ్‌, రాజేశ్‌, మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు

కాంగ్రెస్‌ నేత పురుషోత్తంరెడ్డి

షాద్‌నగర్‌: కొందుర్గు మండలంలో మూడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్‌ నేత పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ కృషితో కొందుర్గు మండలానికి మూడు అంగన్‌వాడీ భవనాలు, రహదారులు, వంతెల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు కొనసాగుతుండటంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వారి ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారన్నారు. శ్రీరంగాపూర్‌, చెరుకుపల్లి, వెంకిర్యాల గ్రామాల్లో రూ.36 లక్షలతో అంగన్‌వాడీ భవనాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఉత్తరాసిపల్లి, టేకులపల్లి గ్రామాల వద్ద రోడ్డు మరమ్మతులకు రూ.1 కోటి 26 లక్షలు, తంగెళ్లపల్లి, చించోడ్‌ గ్రామాల మధ్య వంతెన మరమ్మతులకు రూ.1 కోటి 98 లక్షలు, రేగడిచిల్కమర్రి, తంగెళ్లపల్లి, గంగన్నగూడ రహదారుల పరిధిలో కల్వర్టులు, చిన్న వంతెల మరమ్మతులకు రూ.1 కోటి 36 లక్షలు మంజూరైనట్లు వివరించారు.



బడంగ్‌పేట: గణనాథుడిని దర్శించుకున్న మున్సిపల్‌ కమిషనర్‌ సరస్వతి, అధికారులు



బడంగ్‌పేట: బాలాపూర్‌ గణథునాడి పూజలో సీపీ సీవీ ఆనంద్‌, ఎంపీ కొండా తదితరులు



పహాడీషరీఫ్‌: శ్రీరాంకాలనీలో..



కందుకూరు చౌరస్తాలో అన్నదానం



మీర్‌పేట: జిల్లెలగూడ నవయుగ యూత్‌ గణనాథుడి వద్ద..